



కరీంనగర్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి గంగుల కమలాకర్, పెద్దపల్లిలో మహాత్ముడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, సీపీ రెమో రాజేశ్వరి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, తదితరులు, మెట్‌పల్లిలో నివాళులర్పిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

# మహాత్ముడికి ఘన నివాళి

- ఉమ్మడి జిల్లాలో జయంతి వేడుకలు
- ఆయాచోట్ల పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- కరీంనగర్‌లో గంగుల, పెద్దపల్లిలో కొప్పుల



మంథని మండలం అడవి సోమన్‌పల్లిలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పుట్ట మధూకర్

కరీంనగర్ నెట్‌వర్క్, అక్టోబర్ 2: దేశ స్వాతంత్ర్య ప్రదాత, జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కరీంనగరంలోని కోతిరాంపూర్‌లోని గాంధీ విగ్రహానికి మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్, కలెక్టర్ గోపి పూలమాల వేసి నివాళులర్పించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాల మైదానంలో మెగా రక్తదాన శిబిరం కార్యక్రమంలో గాంధీ చిత్రపటానికి మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పూల మాల వేసి నమస్కరించారు. ఇక తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జమ్మికుంట పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద విగ్రహానికి మండలి విప్, బీఆర్‌ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి నివాళులర్పించారు. మెట్‌పల్లి పట్టణంలోని ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ ఆవరణలో, తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మహాత్ముడి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్ కల్వకుంట్ల పాల్గొన్నారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మంథని మండలం అడవిసోమన్‌పల్లిలో గాంధీ చిత్రపటానికి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ పూలమాల వేసి నివాళులర్పించారు.



గోదావరిఖనిలో గాంధీ విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

## రామగుండాన్ని అభివృద్ధిలో
# టాప్‌లో నిలుపుదాం

- బీఆర్‌ఎస్ విజయాన్ని మంత్రి కేటీఆర్‌కు కానుకగా ఇద్దాం
- దత్తత ప్రకటన మన అదృష్టం
- నియోజకవర్గం మరో సిరిసిల్ల, సిద్దిపేటగా మారబోతుంది
- ఎమ్మెల్యే కోరుకంటి చందర్
- దశాబ్ది ప్రగతి సభను విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు

గోదావరిఖని, అక్టోబర్ 2: మంత్రి కేటీఆర్ చొరవతో రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో నంబర్‌వన్‌గా నిలుపుకుందామని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన గోదావరిఖనిలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వాల పాలనలో రూ.కోటి నిధుల కోసం కోటి దండాలు పెట్టి పరిస్థితులు ఉండేవన్నారు. కానీ స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రతి నియోజకవర్గానికి వందలాది కోట్లు మంజూరు చేసి అభివృద్ధికి చిరునామాగా మారుస్తున్నారని చెప్పారు. ఈ ప్రాంతానికి మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడంలో గత పాలకులు పూర్తిగా విఫలమయ్యారని, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆశీస్సులతో వైద్య కళాశాల కలను సాకారం చేయించినట్లు వివరించారు. నాలుగున్నరేండ్ల తమ పాలనలో రెండేండ్లు కరోనాతో వృథా అయిందని, మిగిలిన సమయం అంతా ప్రజల్లో ఉన్నానన్నారు. దశాబ్ది ప్రగతి సభలో మంత్రి కేటీఆర్ రామగుండాన్ని దత్తత తీసుకుంటానని ప్రకటన చేయడం అదృష్టంగా భావిస్తున్నామని, త్వరలోనే మన ప్రాంతం సిరిసిల్ల, సిద్దిపేటగా మారబోతున్నదన్నారు. రామగుండంలో బీఆర్‌ఎస్ విజయాన్ని కేటీఆర్‌కు బహుమతి అందిద్దామన్నారు. గోదావరి నదికి కరకట్ట నిర్మాణం, నర్సింగ్ కళాశాల, మైనింగ్ ఇంజినీరింగ్ కాలేజీ, సింగరేణి కాలనీలకు మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. దశాబ్ది ప్రగతి సభ విజయవంతం చేసిన సకల జనులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు, కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, పాముకుంట్ల భాస్కర్, కొమ్ము వేణు, పెంట రాజేశ్, జనగామ కవిత, వంగ శ్రీనివాస్, నాయకులు మాదాసు రాంమ్మూర్తి, పాతపెల్లి ఎల్లయ్య, మారుతి, నూతి తిరుపతి, చెల్కలపల్లి శ్రీనివాస్, పిల్లి రమేశ్ ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

# కరీంనగర్‌లో కృతిశెట్టి



చెన్నై షాపింగ్ మాల్‌ను ప్రారంభించి, చీరను ధరించి చూపుతున్న సినీ నటి కృతిశెట్టి

- ది చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి రాక
- జ్యోతి ప్రజ్వలన చేసిన మంత్రి గంగుల
- పాల్గొన్న జబర్దస్త్ ఆర్టిస్టులు

విద్యానగర్, అక్టోబర్ 2 : కరీంనగర్‌లో సువిశాలమైన పార్కింగ్, అతి తక్కువ ధరలతో లెక్కకు మించిన వస్త్ర వెరైటీలు, అధునాతన హంగులతో రూపొందించిన ది చెన్నై షాపింగ్‌మాల్‌ను మంత్రి గంగుల కమలాకర్, సినీ నటి కృతిశెట్టి సోమవారం ప్రారంభించారు. జబర్దస్త్ టీం సభ్యులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా సినీనటి కృతిశెట్టి మాట్లాడుతూ, చెన్నైషాపింగ్ మాల్‌లో నాణ్యమైన దుస్తులు సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో ఉన్నాయని, ₹99కే చీర అమ్మడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల సందర్భంగా ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా, అన్నీ ఒకే దగ్గర దొరికేలా వస్త్రాలు లభించడం బాగుందన్నారు. నిర్వాహకులు మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 17 షోరూంలలో నాణ్యమైన వస్త్రాలు, ఆభరణాల విక్రయాల్లో ఎంతోమంది ప్రజలకు ది చెన్నై షాపింగ్ మాల్ చేరువైందని, 18వ షోరూంను ఉత్తర తెలంగాణకు కేంద్ర బిందువుగా ఉన్న కరీంనగర్‌లో ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. నిష్ణాతులైన డిజైనర్లతో రూపొందించిన అధునాతన డిజైన్లలో పట్టు వస్త్రాలను చేనేత కార్మికులు తమ సొంత మగ్గాలపై నిపుణుల పర్యవేక్షణలో నేశారని, అతి తక్కువ ధరలకే వీటిని ది చెన్నై షాపింగ్ మాల్‌లో అందించగలుగుతున్నామన్నారు. ఇక్కడ లభించే డిజైన్లు, కలర్ కాంబినేషన్లు ఆడ పడుచుల అందాన్ని మరింత ఇనుమడిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా కృతిశెట్టి షాపింగ్ మాల్‌లో సందడి చేసింది. జబర్దస్త్ టీంతో కలిసి డ్యాన్స్ చేసింది. కోర్టు రోడ్ జన సందోహంతో నిండిపోయింది. ఈ కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి హరిశకర్, కార్పొరేటర్లు సరిళ్ల ప్రసాద్, మేచినేని అశోక్‌రావు, నిర్వాహకులు మర్రి వెంకట్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, మర్రి జన్నారెడ్డి, మర్రి మధుమతి, తదితరులు పాల్గొన్నారు.



చెన్నై షాపింగ్ మాల్ జ్యువెల్లరీ షాపును ప్రారంభిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, పక్కన మేయర్ వై సునీల్‌రావు

## రాజన్న క్షేత్రంలో చాగంటి

వేములవాడ టౌన్, అక్టోబర్ 2: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారిని సోమవారం ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర్‌రావు దర్శించుకున్నారు. ఆలయంలో వారికి ఆలయ అర్చకులు,అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి అద్దాలమండపంలో అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేయగా వారికి రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్ స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట జిల్లా బీజేపీ అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, ఆలయ ఏఈవో ప్రతాప నవీన్, పర్యవేక్షకులు అల్లి శంకర్, ఇన్‌స్పెక్టర్ సంకేపల్లి పవన్‌కుమార్ ఉన్నారు.



రాజన్న ఆలయ అద్దాల మండపంలో చాగంటి కోటేశ్వర్‌రావుకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్